
## కథ



# కుందేటి కొమ్ము


రాచపూటి రమేష్

హాస్పిటల్ భవనానికి ఇరవై గజాల దూరంలో వున్న టీ కొట్టు ముందు ఆగింది సుమో.

డోర్ తీసుకొని గబగబా దిగుతున్న వెంకటసుబ్బయ్య నాపి ఎస్సై శశిధర్ '' చెప్పింది గుర్తుందిగా, మామూలుగా ఆ డాక్టరుతో ఎలా మాట్లాడుతావో అలాగే మాట్లాడు. కంగారుపడొద్దు. ఒకవేళ ఆయన బిజీగా వుండి లేటు చేసినా టెన్షన్ పడొద్దు. ఒకట్రెండు గంటలైనా మేము వెయిట్ చేస్తాం. మా గురించి దిగులు పడొద్దు. పని పూర్తి కాగానే హాస్పిటల్ బయటకొచ్చి నేను చెప్పిన సిగ్నల్ ఇవ్వు. అక్కడ అయ్యప్పస్వామి డ్రస్‌లో మా కానిస్టేబుల్ ఒకడున్నాడులే. వెంటనే సెల్‌లో మాకు మెసేజ్ వస్తుంది. మేము సీన్లోకి ఎంటరయిపోతాం'' అన్నాడు. మాసిన పంచె, ఖద్దరు చొక్కాలో వున్న వెంకటసుబ్బయ్య ఒకసారి జేబు తడుముకొని ''అట్లాగే బాబు'' అని తిరిగి చూడకుండా మెయిన్ గేట్లోంచి హాస్పిటల్లోకి వెళ్లిపోయాడు.

ముందు సీట్లో కూర్చుని డీయస్పీ అసహనంగా కదిలాడు. అరగంట నుంచి స్మోక్ చేయక ఇబ్బందిగా ఉందాయనకు. శశిధర్ కారు అద్దాలు తీసి టీ షాపు ఆసామికి ఎనిమిది టీలు ఆర్డరిచ్చాడు. ఎవ్వరూ కారు దిగలేదు. టీలు కార్లోకే సరఫరా చేయబడ్డాయి. టీ తాగిన తరువాత డీయస్పీ జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి ఒక సిగరెట్ తీసుకొని వెలిగించేంతలో శశిధర్ జేబులోని సెల్ మోగింది.

''వావ్, ఈ వెంకటసుబ్బయ్య అలా కనిపించినా... రియల్లీ హీ ఈజ్ వెరీ ఫాస్ట్.. కమాన్, లెట్స్ మూవ్, ఉరుకు రషీదు...''హడావుడిగా అన్నాడు శశిధర్ డ్రైవర్ నుద్దేశించి. కాల్ ముగియగానే, టీ షాపు ఆసామి చేతిలో ఇరవై రూపాయల నోటుంచాడో కానిస్టేబుల్. ''బాబూ చిల్లర..'' అంటున్న టీకొట్టు యజమాని కదుల్తున్న కారు వంక ఆశ్చర్యంగా చూశాడు. విసుగ్గా




సిగరెట్‌ను విండోలోంచి బయటకు వేస్తున్న డియస్పీని చూసి నాకు నవ్వాగలేదు.

***

పదినిమిషాల్లో గుంపుగా ఆర్ఎమ్ ఛాంబరు పక్కనే వున్న సివిల్ సర్జన్ రామ్మూర్తి గదిలోకి ప్రవేశించాడు. దర్జాగా కుషన్ సీట్లో కూర్చుని సూపరింటెండెంట్‌తో కబుర్లాడుతున్న రామ్మూర్తి మా వంక ఆశ్చర్యంగా చూశాడు.

''మిస్టర్ రామ్మూర్తి... ఏది వెంకటసుబ్బయ్య మీకిచ్చిన వెయ్యి రూపాయలు''కటువుగా అడిగాడు ఎస్సై శశిధర్.

''వెయ్యా? అదేమిటి? వెంకటసుబ్బయ్య ఎవరు? నాకు డబ్బివ్వడమేమిటి?'' దబాయించబోయాడు రామ్మూర్తి.

''మిస్టర్ రామ్మూర్తి... ఏమీ ఎరగనట్టు దబాయించొద్దు. వుయ్ ఆర్ ఫ్రం ఏసీబీ. కో ఆపరేట్ విత్ అజ్'' రామ్మూర్తి పేంటు జేబులు చెక్ చేయమని కానిస్టేబుల్ బాషాను ఆదేశించాడు ఎస్పీ రంగస్వామి.

డాక్టర్ రామ్మూర్తి జేబులు చెక్ చేసి పది వంద రూపాయల కాగితాలున్న బొత్తిని బయటకు లాగాడు బాషా. రామ్మూర్తి భయంతో బిక్కచచ్చిపోయాడు. బాషా రామ్మూర్తి చేతులు పట్టుకొని ఫినాఫిలిన్ ద్రవంలో వున్న గ్లాసులో ముంచాడు. నోట్లకు పూసిన లేపనం వల్ల రామ్మూర్తి చేతులు ముంచగానే గ్లాసులోని ద్రావకం ఎర్రగా మారింది.

''రామ్మూర్తి యువర్ గిల్ట్ ఈజ్ ప్రూవ్. మోహన్ ఆ షర్టును కూడా సీజ్ చెయ్యి. గ్లాసుల్లో లిక్విడ్‌ను ప్రిజర్వ్ చెయ్యి. శశిధర్, ప్రెస్‌ను, ఫోటోగ్రాఫర్లను పిలువు.'' హడావిడిగా ఆదేశాలు జారీ చేస్తున్నారు, ఏసీబీ ఎస్పీ రంగస్వామి, ఎస్సై కానిస్టేళ్లకు.

రామ్మూర్తి చిగురుటాకులా కంపించిపోయాడు. అతని కళ్లల్లో భీతి స్పష్టంగా తెలుస్తోంది.

''సార్ ఈ వెంకటసుబ్బయ్య నెల రోజుల క్రితం ట్రాక్టర్ రిపేరని, వెయ్యిరూపాయలు సర్దమని నా దగ్గరకొస్తే మా విలేజ్ పక్క వూరి వాడే గదా అని డబ్బిచ్చా. అది ఇప్పుడు తిరిగి ఇచ్చేశాడంతే'' బుకాయించబోయాడు.

మాయల ఫకీరు ప్రాణాలు వున్న చిలుకను చంపడం చూసి గింజుకుంటున్న మాంత్రికుడిలా కనిపించాడు నాకప్పుడు.

''నథింగ్ డూయింగ్. ఇలాంటి నాటకాలు చాలా చూశాం'' అని ఎస్సై శశిధర్ మా వంక చూసి మీ ఇద్దరు మీడియేటర్ల స్టేట్‌మెంట్స్ రికార్డు చేసుకోవాలి. అలాగే పిటీషనర్ వెంకటసుబ్బయ్యది కూడా.'' అన్నాడు.

''టూ మినిట్స్'' అని భవనం వెలుపలికి వచ్చి రావిచెట్టు కింద నిలబడి సిగరెట్ వెలిగించా. ఒక దమ్ము లాగి పక్కకుతిరిగి చూస్తిని కదా... గేటు దగ్గర రెండు చేతులు నడుముకు ఆన్చి గంభీరంగా నిలబడి వున్నాడు ఆంజనేయులు. మొఖాన వెధవ నవ్వొకటి. నాకా సమయంలో ఆంజనేయులు మీద పీకల్దాక కోపం తన్నుకొని వచ్చింది. ''పాపమా డాక్టరు కెరీర్ నాశనమైపోయినట్లే గదా... ఈ వెధవ వల్ల'' అనుకున్నాను. క్రితం రోజు సంఘటనలు నా కళ్ల ముందు గిర్రున తిరిగాయి.

***

సాయంత్రం ఐదున్నరకు ఫైళ్లు బీరువాలో సర్ది ఇంటికి వెళ్లే మూడ్‌లో వున్నాను. లీలామహల్లో మంచి ఇంగ్లీషు పిక్చరు ఆడుతోంది. ఫస్ట్‌షోకు వెళదామనుకుంటున్నా.

''సార్ మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు'' చావు కబురు చల్లగా చెప్పాడు ప్యూను చలమయ్య.

ఏం కొంపలు మునిగాయో అని ఆఫీసరు గదిలోకి అడుగుపెట్టా అదురుతున్న గుండెల్తో.

''మిస్టర్ మహేష్.... రేపొద్దున్న పదిగంటలకు మీరు ఏసీబీ టీంతో పాటు మీడియేటర్‌గా వెళ్లాలి. ఎనిమిదిగంటలకే వారి ఆఫీసు దగ్గరకు రమ్మన్నారు ఏసీబీ ఎస్సై. మీకు కేసు గురించి బ్రీఫింగ్ ఇయ్యాలట'' చావు కబురు మళ్లీ చెప్పాడు ఇకిలిస్తూ మా గురుడు.

''సార్, రేపు పెండింగు ఫైల్సు చాలా క్లియర్ చెయ్యాలి. అదీ గాక....'' నా నసుగుడు కట్ చేసి, ''ఏం చేద్దాం? ఏసీబీ వాళ్ల ఆదేశాలు కాదనేందుకు లేదు. ఒక గుమస్తా సిక్‌లీవ్‌లో వున్నాడు. మరొకరు వాళ్ల ఫాదరుకు బాగా లేదంటే వెళ్లాడు కదా. మీకీ తద్దినం తప్పదు'' తాపీగా చెప్పాడు ఆఫీసరు.

ఏసీబీ వాళ్ల రెయిడ్స్‌తో నాకిదివరకు సాక్షిగా వెళ్లిన అనుభవం వుంది. అది ఒకరోజుతో పోదు. కేసు కోర్టులో హియరింగుకు వచ్చినప్పుడు ఏ నెల్లూరో ఏడెనిమిది సార్లు స్వంత ఖర్చులతో తిరగాల్సి వుంటుంది. ఏసీబీ వాళ్లు టిఏ, డిఏలు ఇవ్వరు. మా డిపార్ట్‌మెంటూ ఆ డబ్బులు మంజూరు చెయ్యదు. తడిసి మోపెడు ఖర్చు మీదపడుతుంది.

''అదీగాక చేజేతులా మరో ఉద్యోగి ఉద్యోగం పోగొట్టి అతని జీవితం నాశనం చేస్తున్నామనే ఫీలింగొకటి''.

రోకట్లో తల పెట్టాక ఆలోచించేముందని మరుసటి రోజు ఎనిమిదింటికే ఏసీబీ వారి ఆఫీసుకు నా డొక్కు మోపెడ్లో చేరుకున్నాను. ఒకరిద్దరు సివిల్ డ్రస్‌లోని కానిస్టేబుళ్లు మాత్రమే వున్నారు. ''ఎస్సై, ఎస్పీ గారు వస్తారు'' కూర్చోండి అన్నారు వాళ్లు. 'మనల్ని ముందు రమ్మని వాళ్లు తాపీగా వస్తారన్న మాట'అనుకున్నాను.

గదిలోకి ఎంటరయ్యి అక్కడ కూర్చుని నా బాల్య మిత్రుడు ఆంజనేయులను చూసి షాకయ్యా. పక్కనే ఖద్దరు చొక్కా, మాసిన గడ్డంతో వున్న మరో అర్భకుడు కూర్చుని వున్నారు.

ఏదో మాట్లాడబోయిన ఆంజనేయులను వారించి ''టీ తాగుదాం రండి సార్'' అని ఆఫీసు బయటకు తీసికెళ్లా. ఆంజనేయులు నా వంక అయోమయంగా చూశాడు.

''నేనీ కేసులో మధ్యవర్తిగా వచ్చా! నాకు అటు కంప్లైంట్ చేసిన వారితో, దాడి చెయ్యబోయే వ్యక్తితో పరిచయాలుండకూడదు. ఏజ్ ఫర్ రూల్స్. అది సరే గాని ఈ దగుల్బాజీ ఫిర్యాదిచ్చింది నువ్వేనా''అని టీచప్పరిస్తూ అడిగాడు ఆంజనేయులును.

ఆంజనేయులు చిరునవ్వు నవ్వాడు.

''తినబోతూ రుచెందుకు? అది సర్లే గాని, ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు? ఎప్పుడీ వూరొచ్చావు? పిల్లలెంతమంది?'' వరుస ప్రశ్నలతో వూదరగొట్టాడు. చాలా ఏళ్ల తర్వాత కలిశాం కదా...

''ఆర్నెల్ల ముందు ట్రాన్స్‌ఫర్ అయి ఈ వూరొచ్చాను. సరే. ఏమిటి కథ? పాపం ఎవడి గొంతు కొయ్యబోతున్నావ్?'' అడిగాను ఆత్రంగా.

ఆంజనేయులు పళ్లు పటపటా నూరాడు. ''చంపడమా, నరకడమా, ముక్కలు ముక్కలు చేయాలి వాడ్ని. శవాలను పీక్కుతినే రాబందులు.'' అన్నాడు ఆవేశంగా...

''ఎవరి గురించి నువ్వు మాట్లాడ్డం...''

''వాడెవడో జనరల్ హాస్పిటల్‌లో డాక్టరు రామ్మూర్తిట. నేనీ వూర్లోనే పదేళ్ల నుండీ ఫైనాన్సు వ్యాపారం వెలగబెడుతున్నానులే. ఇందాక నువ్వు చూసిన ఖద్దరుచొక్కా శాల్తీ నా దగ్గరే లెక్కలు రాసే గుమస్తాగా వున్నాడు. అతగాడికేదో కాటరేక్ట్ ఆపరేషన్ రెండు కళ్లకు అవసరం. డబ్బిచ్చి ఖరీదైన హాస్పిటల్లో చేరలేదు. గవర్నమెంటు ఆస్పత్రిలో చేయిద్దామంటే పదిహేను వందలు డిమాండ్ చేస్తున్నాడట. ఈ పనికిమాలిన వైద్యశిఖామణి. వెయ్యి

రూపాయలైనా లేందే కథ నడవదన్నాడట చివరకు. నన్ను డబ్బుడిగాడు వెంకటసుబ్బయ్య.

నాకీ వ్యవహారం చూస్తే ఒళ్లు మండింది. నేరుగా ఏసీబీ వాళ్ల దగ్గరకు లాక్కొచ్చా వారం క్రితం. వివరాలు కనుక్కొని ఈ రోజు రమ్మన్నారు. ఆ డాక్టరు భరతం పడతారీరోజు. వాడి అవినీతి పురాణానికి చరమగీతం పాడతారు...'' ఊపిరి పీల్చుకోకుండా గబగబా చెప్పుకు పోతున్నాడు ఆంజనేయులు.

''చిన్నగా మాట్లాడు. ఎవరైనా వింటారు. ఐనా ఇస్తే ఆ సుబ్బయ్యకి వెయ్యి రూపాయలివ్వు. లేదా ఇంకో దగ్గర ట్రై చెయ్యమను. మధ్యలో అతని కంటి శుక్లాలేమైపోవాలి?'' అన్నాను నవ్వుతూ.

ఆంజనేయులకు మళ్లీ బీపీ పెరిగినట్లయింది.

''అంటే ఒక బాధ్యతాయుతుడైన పౌరుడిగా ఉద్యోగిగా వుంటూ కూడా నువ్వు అవినీతిని ఎంకరేజ్ చేస్తావా? నీలాంటి వాళ్లు వుండబట్టే ఈ దేశంలో అన్ని చోట్లా అవినీతి రాజ్యమేలుతోంది. ఒక బీదవాడికి ఉచితంగా వైద్య సహాయం అందించలేరా ఈ డాక్టర్లు. వేలకు వేలుజీతాలు మాత్రం గుంజుతారే...'' కోపం నషాళానికెక్కినట్లుంది ఆంజనేయులికి. ఆ సమయంలో ఎర్రబడ్డ ముఖంతో ఉగ్ర రూపంలో వున్న ఆంజనేయస్వామిలాగే కనబడ్డాడు వాడు నా కంటికి.

''అది కాదు గురూ... ఈ అమ్యామ్యా చరిత్ర ఈ నాటిది కాదు. నరకాసురుణ్ని చంపానని పారిజాత పుష్పం సమర్పించుకోమంది సత్యభామ కృష్ణుడుని. కృష్ణుడేం తక్కువ తిన్నాడా? శమంతక మణిని కానుకగా ఇచ్చి సత్రాజిత్తును ప్రసన్నం చేసుకున్నాకే సత్యభామను పెళ్లాడాడు... కైకేయి......''

''ఆపు నీ సుత్తి. పుక్కిటి పురాణాల గురించి కాదు నేను మాట్లాడేది. ప్రభుత్వం అన్ని శాఖలకు, హాస్పిటళ్లకు కోట్లు కుమ్మరించి పథకాలనందజేస్తుంది. లంచావతారాల చేతుల్లో పడి ఆ పథకాలు ఎందుకు కొరగాకుండా పోతున్నాయి. ఆ రామ్మూర్తి గురించి విచారించాకే నేనీ పనికి పూనుకొన్నా. చెయ్యి తడపందే సిరంజి కూడా తాకడు. వాడు జీపీఎఫ్ సర్టిఫికెట్లకు, దొంగ మెడికల్ బిల్లులకు భారీగా ముడుపులు వసూలు చేస్తాడట. ఆస్పత్రిలో రెండు గంటలుంటే, ఆఫీసు టైంలోనే క్లినిక్‌లో వుంటాడు. మరో నాలుగు గంటలు....''

''ఏదో సామెత చెప్పినట్లుంది. అవినీతి సర్వాంతర్యామి. నేడు ఓ రోడ్డుకు పదిరూపాయలిస్తే, నాలుగు రూపాయలు కాంట్రాక్టరుజేబులోకి, మూడు ఇంజినీరుకు, రెండునాయకులకు పోతె, రూపాయో, అర్థో ఆరోడ్డు పని మీద వెచ్చింపడుతోంది. కుందేటి కొమ్ము సాధిస్తామనుకోలేదు. అవినీతి రూపుమాపాలనుకోవడం ఒకటే.

అసలు ఇలా వ్యక్తులను అరెస్ట్ చేస్తే ఈ కరప్షన్ మాయమవుతుందనుకుంటున్నావా? రోజూ పేపర్లలో ఇంతమంది ఏసీబీ కేసుల్లో అరెస్ట్ అయి ద్యోగాలు పోగొట్టుకుంటున్నారని చదువుతూనే వుంటాం. మరి అవినీతి వరద ఏమైనా తగ్గిందా? లేదే!''

మరి దీనికి మార్గాంతరం ఏముందంటావు?'' వక్కపొడి ప్యాకెట్ చింపి నా చేతిలో కాసింత పోస్తూ అడిగాడు ఆంజనేయులు.

''వ్యవస్థలో మార్పు రావాలి. అదంత సులభం కాదు. బ్రిటీష్ వాళ్ల హయాంలో కట్టిన బిల్డింగ్స్ ఈ నాటికీ చెక్కుచెదరకుండా వుండడం, బ్రిడ్జిలు పటిష్టంగా వుండడం చూస్తున్నాం. మరి ఆనాటి ఉద్యోగుల్లో ఆపాటి నిజాయితీ వుండేది.

ఆకాశానికి అర్రులు చాస్తూ విలాసాల వెనుక పరుగులు తీస్తోంది నేటి తరం. వాళ్లకు సింప్లిసిటీ విలువ నేర్పాలి. ఈ నాటి కంప్యూటర్ చదువుల్లో నీతి పాఠాలకు చోటు లేదు.

ఒకప్పుడు సుమతీశతకం, అమరం, భర్తృహరి సుభాషితాలు వల్లె వేయించేవారు మాస్టార్లు. పిల్లలు అందులోని నీతులను కొద్దో, గొప్పో వంట బట్టించుకొనేవాళ్లు. అలాగే పురాణగాథలు, పంచతంత్ర కథల్లో నీతులను ఆదర్శంగా తీసుకునేవాళ్లు. ఈరోజు ఆ పద్యాలు, కథలు వినడానికెవ్వరికీ టైం లేదు.''

ఆఫీసు ముందు ఏదో జీపు ఆగడంతో ఉలిక్కి పడ్డాం. వెంటనే కబుర్లాపి ఏసీబీ ఆఫీసులోకి వెళ్లాం. ఎస్పై శశిధర్ నాకూ, మరో శాఖ నుంచి వచ్చిన ఇంకో మీడియేటర్‌కు కేసు వివరాలు చెప్పాడు. ఫినాఫ్థలిన్ టెస్టు, డెమనాస్ట్రేట్ చేసి వందరూపాయల నోటు నెంబర్లు రాసుకోమన్నారు.

మరో అరగంటలో సుమోలో పది కిలోమీటర్ల దూరంలో వున్న గవర్నమెంటు హాస్పిటల్‌కు బయల్దేరాం. ఆంజనేయులు మాత్రం బైక్‌లో ఫాలో అయ్యాడు. తర్వాతి కథ తెలిసిందే...

***

డాక్టరు రామ్మూర్తిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హేండోవర్ చేసిన తర్వాత భారమైన మనసుతో నేనిల్లు చేరాను.

పనివత్తిడిలో వుండి మరో రెండు నెలల పాటు ఆ కేసు విషయమే మరిచిపోయా. ఒకరోజు సాయంత్రం బజార్లో ఆంజనేయులు కలిశాడు. ''కేసు ఏమైందని అడిగాను'' ఆత్రంగా.

ఆంజనేయులు బిగ్గరగా నవ్వాడు.

''నువ్వు చెప్పిందే కరెక్టు గురూ. ఈ కేసులన్నీ హంబగ్‌లాగానే కనిపిస్తున్నాయి. వ్యక్తులు అరెస్ట్ అయినంత మాత్రాన అవినీతి రూపుమాసిపోతుందనుకోవడం నా భ్రమ.

నెలరోజుల పాటు రామ్మూర్తి నెల్లూరు జైలుకు, ఇంటికి మధ్య గిరిడీలు కొట్టాడు. బెయిల్‌పై విడుదలై హాయిగా ఇంటి దగ్గరే వున్నాడు. పూర్తి టైం ప్రయివేట్ ప్రాక్టీసుకు వెచ్చిస్తూ రెండు చేతులా సంపాదిస్తూనే వున్నాడు.

అంతేగాదు! బ్యాక్‌డేట్‌తో సర్టిఫికెట్లు ఇస్తూ, జీపిఎఫ్ డ్రాయల్సు కేసుల్లో, సిక్‌లీవ్, రీ ఎంబర్స్‌మెంటు కేసుల్లో కూడా యథాశక్తి గుంజుకుంటూనే వున్నాడట.'' అన్నాడు బాధగా.

''మరి వెంకటసుబ్బయ్య కథేమిటి? అతనికి కంటి శుక్లాల ఆపరేషన్ జరిగిందా...?'' ఆసక్తిగా అడిగాను.

''ఆ ఒక్కటి అడక్కు. తమ డాక్టరును పట్టించాడన్న కోపంతో ఆ ప్రభుత్వాసుపత్రి స్టాఫ్ ముప్పతిప్పలు పెట్టారతడ్ని. చివరికాయన బాధ చూడలేక మూడు వేలు పెట్టి నేనే ప్రైవేట్ హాస్పిటల్లో ఆపరేషన్ చేయించా'' అని వాపోయాడు ఆంజనేయులు బాధగా...

గోటితో పోయే దానికి గొడ్డలి అవసరమా... అని అనబోయి మళ్లీ ఆంజనేయులు ఉగ్రరూపం తలుచుకొని ఆ మాటలు మనసులోనే మింగేశా...

★

